06ATP27_06ATP27.qxd 26-07-2024 PM 11:04 Page 1



## ప్రత్యేక అధికారి ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

అగళి, జులై 26 ప్రభాతవార్త



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి

అగళి ఆసుపత్రి (పిహెచ్‌సి)ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ శివానంద, డా.గాయత్రిలతో సమాచారాన్ని వివరంగా అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టీతోపాటు సిబ్బంది పనితీరు, సిబ్బంది కొరత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల సమయం కావున డాక్టర్లతోపాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆపరేషన్ థియేటర్‌తోపాటు మందుల వివరాలను అడిగితెలుసుకున్నారు. వీరివెంట స్టాఫ్‌నర్సు లక్ష్మమ్మ, నర్సా రెడ్డి, సుబ్బయ్య, భూషణ్ నాయక్, సుందరయ్య ఉన్నారు.

## రైతులకు సబ్సిడితో రాగులు

అగళి, జులై 26 ప్రభాతవార్త

రైతులకు అన్ని సేవాకేంద్రాలద్వారా మేలైన, నాణ్యమైన రాగి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. నాణ్యమైన రాగి విత్తనం ఇంద్రావతి రకం అందుబాటులో ఉందన్నారు. దీని పూర్తి ధర బస్తా 145 కాగా, రైతు సోదరులకు 50 శాతం సబ్సిడితో నాలుగు కేజీల రాగుల పాకెట్‌ను 73 రూపాయలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేపల్లి, హల్లికెర, మండల వ్యాప్తంగా 20 క్వింటాళ్ల నాణ్యమైన రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సిడిపిఓ

అగళి, జులై 26 ప్రభాతవార్త

సిడిపిఓ నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్ లీలావతిలు శుక్రవారం అగళితోపాటు తొనసనపల్లి, కదిరేపల్లి, మధూడి గొల్లహట్టిలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలకు ఆధార్ నమోదుతోపాటు, పౌష్టికాహార పంపిణీ గురించి అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు.

## గ్రామ దేవత గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి, జులై 26 ప్రభాతవార్త



మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో శుక్రవారం ఉదయం గ్రామ దేవత గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాల కులస్తులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న గంగమ్మ తల్లికి నిత్యం పూజలుచేస్తూ ఉండేవారు గ్రామానికి చెందిన ఓ మతిస్థిమితం లేని మహిళ గుడిలోనికి ప్రవేశించి విగ్రహంలోని ఒక భాగాన్ని విరగొట్టడం జరిగింది. కావున ఇంత వరకు ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని మరమ్మత్తు చేయించలేదు. విరిగిన విగ్రహం గ్రామంలో ఉండటం వల్ల వర్షాలు పడటం లేదని గ్రామానికి అరిస్టంగా ఉందని భావించి కొందరు పెద్దలు ముందుకు వచ్చి మాల కులస్తులతో మాట్లాడి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో గురువారం గ్రామస్తుల సహకారంతో నూతనంగా తయారు చేయించిన అమ్మవారి విగ్రహాన్ని గురువారం రాత్రి, గ్రామంలోని పుర వీధుల గుండా, ఘనంగా ఊరేగింపు చేశారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి వారిని గుడిలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా, గ్రామస్తులు వచ్చి అమ్మవారి ప్రతిష్ట పూజ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక దిగుబడి

**- జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ సనావుల్లా**

ధర్మవరం, జులై 26 ప్రభాతవార్త



రైతులకు సలహాలు సూచనలు తెలుపుతున్న అధికారులు

ప్రతి రైతు తన పొలంలో ప్రత్యామ్నాయ పంటలు పండించి ఖచ్చితమైన అధిక దిగుబడులు సాధించ వచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ సనావుల్లా, సహాయ వ్యవసాయ సంచాలకులు, ధర్మవరం కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని తుమ్మల రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం, రాగి, పప్పు దినుసులు సాగు చేసుకోవాలని తెలిపారు. పంట సాగులోని మెలుకువలను మేలైన సాగు పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సమతుల్యమైన ఎరువులను వాడడం, నానో యూరియా, డిఏపిలు వాడకం డ్రోన్ల ద్వారా సస్యరక్షణ, మందుల పిచికారి చేయడం, వాటి ఉపయోగాలు గురించి రైతుకలు పూర్తి వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. సాగు చేసిన కంది పొలాలను కూడా అధికారులు పరిశీలించారు. అధిక దిగుబడిని సాధించడానికి ఎకరాకు 12000 మొక్కల సాంద్రత ఉండాలని, దీనికోసం సాలుకు మధ్య ఆరడుగులు, ఒక సాలులో మొక్కల మధ్య ఒక అడుగు దూరం ఉండాలని వారు సూచించారు. కందిలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎకరాకు ఒక లీటర్ వేప నూనె పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, రైతు వనరుల కేంద్రం ఏఓ అబ్దుల్ అలీ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు దివ్యా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిగా దర్శనమిచ్చిన దుర్గా భవాని అమ్మవారు

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



పట్టణంలోని దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారు తెలంగాణ రాష్ట్రంలోని హైదారాబాద్‌లోని జుబ్లీహిల్స్ లో వెలసిన ప్రసిద్ధ పెద్దమ్మతల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం ఆషాడ 3వ శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుండి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకొని ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించింది.

## ఉద్యోగులు తప్పక సమయ పాలన పాటించాలి

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త

ఉద్యోగులు ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని ఎంపీడీఓ జి.వి. సుబ్బరాజు సూచించారు. శుక్రవారం ఆయన మండలపరిధిలోని రాకెట్ల గ్రామసచివాలయాన్ని తనిఖీచేశారు. ఈసందర్భంగా సిబ్బంది హాజరుపుస్తకాన్ని ఆధారంచేసుకొని బయోమెట్రిక్ అడెండెన్స్‌ను పరిశీలించారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమని బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## 28న ఉచిత వైద్యఆరోగ్యశిబిర విజయోత్సవ వేడుకలు

అమరాపురం, జులై 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వీరశైవ కళ్యాణమండపంలో వైద్యఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో 28వతేదీ ఆదివారం 200వ వైద్యఆరోగ్య శిబిరం పూర్తవుతున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం, విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజ్, టీచర్ శ్రీనివాస్‌మూర్తి, రిపోర్టర్ ఎస్.సిద్ధేశ్వరప్ప, రమేష్‌బాబు, అజయ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి నెలా ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లకు సన్మాన కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్‌డిఎన్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైత్రి కుటుంబసభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బెంగుళూరులో స్థిరపడిన అమరాపురం గ్రామస్తులు, గ్రామ ప్రజల సమన్వయంతో 2005లో అమరాపురం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ స్థాపించి ప్రతి నెలా మూడవ ఆదివారం ఉచిత వైద్యఆరోగ్య శిబిరాన్న అమరాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28వతేదీన 200వ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

## ఆషాడమాసం సందర్భంగా విశేష అలంకరణలో అమ్మవారు

అమరాపురం, జులై 26 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలో శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు హరీష్‌బట్టర్, నరసింహబట్టర్‌లు విశేష పూజలతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆషాడమాసం మూడవ శుక్రవారం శ్రీకన్యకాపరమేశ్వరిదేవి వాయనాల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

## అభివృద్ధికి సహకరించండి..

**- సర్వసభ్య సమావేశంలో.. ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఎంపిపి గంగమ్మ**

సోమందేపల్లి, జులై 26 ప్రభాతవార్త



సర్వ సభ్య సమావేశంలోని దృశ్యం

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడి వేడి లేకుండా కొనసాగింది. సభకు ఎంపిపి గంగమ్మ వెంకట రత్నం అధ్యక్షత వహించారు. ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అధికారులు తమ శాఖల పరిధిలో పనితీరును గత సర్వసభ్య సమావేశంలో మిగిలి పోయిన విషయాలపై మాట్లాడాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అంజనేయులు నాయక్ మాట్లాడుతూ.. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది జూన్ నెల వరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు అందాయన్నారు. మండల పరిధిలో పలు పాఠశాలల్లో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించే బాధ్యతను తీసుకున్నామన్నారు. అంతేకాకుండా మండల పరిధిలో రెండు మూడు గ్రామాలలో అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించామని వాటి స్థానంలో నూతన భవనాల్లోకి మార్చడానికి సిద్దంగా ఉన్నామన్నారు. అనంతరం తహశీల్దారు అంజనాదేవి మాట్లాడుతూ.. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా సోమందేపల్లి ఒకటవ ఎంపిటిసి పూజారి ఈశ్వరయ్య గ్రామంలో హజందూ స్మశాన వాటికకు వెళ్లడానికి దారి లేదని దారి చూపాలని కోరారు. అదే విధంగా పలు గ్రామాల్లో రైతులు వన్‌బీలు అందకుండా ఇబ్బందులు గురవుతున్నారని తక్షణమే వారికి వన్‌బిలు అందేలా చూడాలనికోరారు. స్పందించిన తహశీల్దార్ స్మశాన వాటికకు దారితోపాటు, సకాలంలో రైతులకు వన్‌బి అందేలా చూస్తామన్నారు. అదే విధంగా హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 1400 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నడుం బిగించామన్నారు. ప్రస్తుతం 750- దాకా ఇళ్లు పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ స్టేజ్ రూపాల్లో ఉన్నాయన్నారు. ఇంకా మండల పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంకులు సమస్య ఉందని వారిటి పరిష్కరించాలని సభ్యులు కోరారు. అంతేగాక మండల వ్యాప్తంగా స్టోర్ డీలర్లను తొలగిస్తున్నారని అర్హులకు న్యాయం చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు విరివిగా రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకర్లను ఆదేశించామన్నారు. మహిళాసంఘాలకు అందుతున్న మొత్తాలను పెంచాలని, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సబ్సిడి రుణాలు అందేలా చూడాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా చూడడానికి అవసరమైన నిధులు పంచాయితీలకు అందేలా చూడాలన్నారు. జనాభా దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో ఓపి సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెంచాలన్నారు. వర్షాకల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సిబ్బంది తరచూ గ్రామాలను కాలనీలను సందర్శించి ప్రజల వ్యాధుల బారిన పడకుండా వివరిస్తూ పరిస్థితులు కనుగుణంగా ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యం వారికి అందేలా చూడాలన్నారు. ఈసందర్భంగా ఎంపిపి గంగమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా పంచాయితీ అభివృద్ధి కుంటు పడకుండా అభివృద్ధి బాటలో నడవాలి అన్నారు. పార్టీలకతీతంగా గ్రామలను అభివృద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరవకొండ సర్పంచ్ అవినీతి, అక్రమాలపై విచారణ జరపండి

**-డీపీఓను కోరిన మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు**

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



వినతిపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అవినీతి, అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు యం.రామాంజినేయులు, చేజాల ప్రభాకర్, వేల్పుల ఎా న్ ు దో వ్ు డ్ ు, పి.నిర ంజన్‌గౌడ్ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావును కోరారు. జిల్లా కేంద్రం అనంతపురంలో వారు డీపీఓకు ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ ఈనెల 24న జరిగిన మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం అజెండాలోని 22వఅంశంలోని జేసీబీ బిల్లులు 27,800 రూపాయలు, 33వ అంశంలోని రథోత్సవానికి చెందిన బిల్లు 4,23,704 రూపాయలు, 40వ అంశంలోని హైమాస్కులైట్ బిల్లు3,41,650 రూపాయల్లో అవినీతి,అక్రమాలు జరిగా యని ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీపీఓను కోరినట్లు వివరించారు.

## అగ్నిగుండం మధ్యలో నిల్చొని నమాజ్..!

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



అగ్నిగుండంలో ప్రార్థనలు చేస్తున్న షఫీవుల్లా

చిన్నపీర్ల పండుగలో శుక్రవారం ఉదయం అరుదైన ఘటన చోటు చేసుకుంది. ఉరవకొండ పట్టణంలోని 10వ వార్డు కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్లవద్ద కొలువుదీర్చే హసేన్, హుసేన్ పీర్ల చావిడి ముందు వేసిన అగ్నిగుండంలో పీర్లను గత 11 సంవత్సరాలుగా ఎత్తే ముల్లా షఫీవుల్లాతోపాటు అగ్నిగుండం మధ్యలో నిప్పులపై గుడ్డ వేసుకొని నమాజ్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన ఘటనను చూసిన వారందరూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పీర్ల పండుగలో భాగంగా చివరిరోజు పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేయడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే.

## దళిత పారిశ్రామిక వేత్తల సమస్యలను పరిష్కరించండి

**-మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు మీనుగ గోపాల్**

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



మంత్రి పయ్యావుల కేశవ్‌కు పూల బొకె అందించి సన్మానిస్తున్న దృశ్యం

దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు మీనుగ గోపాల్ విన్నవించారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రిను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందించి పెట్టుబడి రాయితీ గరిష్టంగా 75 లక్షల రూపాయలు అందజేసిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటివరకు అందుతున్న రాయితీలు, సౌకర్యాలను పూర్తిగా ఎత్తివేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమలు పెట్టిన తర్వాత ఆ యూనిట్ విజయవంతంగా 5 సంవత్సరాలు నడిచిన తర్వాత మాత్రమే రాయితీ పొందేందుకు అర్హత ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఒక్కో ప్లాట్ మాత్రమే ఇచ్చేలా, ప్లాట్ తీసుకోవాలంటే మోదటి పెట్టిన పరిశ్రమ రాయితీ పొంది ఉండేలా నిబంధనలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చిందని మంత్రికు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్లాట్ అమ్మాల్సివస్తే ఎస్సీ, ఎస్టీలు గతంలో పొందిన రాయితీ తిగిరి ఇచ్చేలా మార్పులు జరిగాయన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు 22.5 శాతం రాయితీలు ఏపీఐఐసీ అమలు చేస్తుందని అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టిన ఈ నిబంధనలవల్ల అది 1.5శాతం కూడా మించడంలేదన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఎవరూ కూడా మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్స్ పెట్టడానికి ముందుకు వచ్చే పరిస్థితులు లేవన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన దళిత పారిశ్రామిక విధానాన్ని పునరుద్ధరించాలని మీనుగ గోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు, కాలువ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

**-ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించిన చాబాల టీడీపీ నాయకులు**

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు బోకె అందిస్తున్న చాబాల గ్రామ టీడీపీ నాయకులు

గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు విన్నవించారు. శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చాబాల గ్రామ మాజీ సర్పంచ్ సి.ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు లింగమూర్తి, అనంతయ్య, మహేష్, రామాంజినేయులు, శివ తదితరులు ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేసి వివిధ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. చాబాల గ్రామం నుండి ధర్మపురి, జనార్ధనపల్లి వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామం నుండి ఎన్.తిమ్మాపురం వరకు రోడ్డు పరిస్థితి కూడా అదేరకంగా ఉందని బీటీ రోడ్డును మంజూరు చేయాలన్నారు. రాగులపాడు వద్ద నుండి హంద్రీనీవా పిల్ల కాలువలో కృష్ణా జలాలు పారడానికి చెట్లు, పూడిక అడ్డంకిగా మారిందని వాటిని తొలగించి చాబాల మీదుగా గడేహోతూరు, చిన్నహోతూరు, ధర్మపురి, పొలికి గ్రామాలకు నీటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని వారు మంత్రిను విన్నవించారు.

## భక్తిశ్రద్ధలతో పీర్ల అగ్నిగుండ ప్రవేశం

**-జలధితో ముగిసిన మోహర్రం వేడుకలు**

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



ప్రత్యేకాలంకరణలో చిన్న లాలుస్వామి పీర్ల చివరి దర్శనం

చిన్న మోహర్రం పండుగలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పీర్ల అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. పెద్ద మోహర్రం వేడుకలు ముగిసిన మరుసటిరోజు నుండి ప్రారంభమైన చిన్న మోహర్రం వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి పెద్ద సరిగెత్తు సందర్భంగా భక్తులు స్వామివార్లకు ప్రత్యేక చదివింపులు నిర్వహించి చక్కెర తులాభారాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేయగా సాయంత్రం వివిధ ప్రాంతాల్లో కొలువుదీర్చిన పీర్లను భక్తులకు చివరి దర్శనం ఇచ్చిన అనంతరం స్థానిక బీబీ జైనబ్బీ దర్గా ఆవరణంలో కలుసుకొని ఆలింగనాల అనంతరం జలధికి తరలించారు. పీర్లకు దారిపోడవుగా భక్తులు చదివింపులు జరిపారు.

## రాయలసీమ కరువు నివారణకు సమాంతర కాలువను నిర్మించండి

తాడిమర్రి, జులై 26 ప్రభాతవార్త



జల వనరుల శాఖ మంత్రిని కలిసిన దృశ్యం

గత కొన్నేళ్లుగా రాయలసీమను పట్టి పీడిస్తున్న కరువును పారద్రోలాలంటే తుంగభద్ర నదిని సమాంతరంగా వరద కాలువను నిర్మించడం ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయవచ్చునని సర్పంచుల సంఘం అధ్యక్షులు నిడిగల్లు భూషణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అమరావతిలోని సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిశారు. కాలువ నిర్మాణంపై పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టిబి డ్యాం నుంచి ఇప్పుడు వస్తున్న హెచ్ఎల్‌సి కాలువకు సమాంతరంగా వరద కాలువ నిర్మిస్తే ఎత్తిపోతల పథకాలు లేకుండా గ్రావిటీ ద్వారా లోతట్టు ప్రాంతాలకు నీటిని సరఫరా చేయవచ్చునన్నారు. అలాగేరాయలసీమలోని లోతట్టుప్రాంతాలకు ఈ కాలువను అనుసంధానం చేయడం ద్వారా సాగునీరు రైతులకు అందుతుందన్నారు. తద్వారా రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని వివరించారు. ఆయన వెంట దేగల కృష్ణమూర్తి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పుట్టపర్తి రానున్న కర్ణాటక ఉపలోకాయుక్త జడ్జి బి.వీరప్ప

పుట్టపర్తి, జులై 26, ప్రభాతవార్త

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి కార్ణటక ఉప లోకాయుక్త జడ్జి బి.వీరప్ప కుటుంబ సమేతంగా శనివారం పుట్టపర్తి పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఆయన శనివారం ఉదయం 08:45 గంటలకు సతీసమేతంగా మొత్తం 8 మంది కుటుంబ సభ్యులతో బెంగుళూరు నుండి బయలుదేరి రోడ్డు మార్గం గుండా పుట్టపర్తి చేరుకుంటారన్నారు. 10:45 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం చేసుకున్న తరువాత 02:00 గంటలకు పుట్టపర్తినుండి బయలుదేరి సాయంత్రం 04:00 గంటలకు బెంగుళూరు చేరుకుంటారన్నారు.

## అనాథాశ్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ డిడి వివాహ వార్షికోత్సవం



పిల్లలకు విద్యాసామిగ్రిని అందిస్తున్న బిసి వెల్ఫేర్ డిడి నిర్మలజ్యోతి దంపతులు దృశ్యం

శ్రీసత్యసాయిజిల్లా (వైద్యం), జులై 26, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా బిసి వెల్ఫేర్ డిడిగా పనిచేస్తున్న నిర్మల జ్యోతి తన భర్త సురేష్‌కుమార్‌తో కలసి తమ 4వ వివాహ వార్షికోత్సవంను కొత్తచెరువు మండల పరిధిలోని మైలేపల్లి గ్రామంలో ఉన్న కరుణ వృద్ధాశ్రమం నందు జరుపుకున్నారు. శుక్రవారం వృద్ధాశ్రమంలో ఉన్న అనాధ బాలికలకు 100 కెజిల బియ్యం, ఒక సీలింగ్ ఫ్యాన్, ఎల్ఇడి టీవి, పిల్లలకు పుస్తకాలు, పెన్నులను వంటి విద్యోపకరణాలతో పాటు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నదానం చేసి వారితో పాటు సహపంక్తిభోజనం చేశారు. ఒక జిల్లా స్థాయి అధికారి తమ కుటుంబంతో సామన్యుల వలె వేడుకలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని కరుణ వృద్ధాశ్రమ నిర్వహకుడు దావీద్ తెలిపారు. రాబోవు రోజులలో పిల్లకు యూనిఫాం వంటి అవసరమైన సహాయలు తనవంతుగా చేస్తామని వారు హామీ ఇచ్చారు. డిడి నిర్మలజ్యోతి మాట్లాడుతూ, కష్టం విలువతమకు తెలుసని, చిన్నారులు బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని తమ వివాహ వార్షికోత్సవంను ఒక్కడ చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



ఐక్యతను చాటుతున్న వడ్డెర్ల సంఘం నాయకులు

పుట్టపర్తి, జులై 26, ప్రభాతవార్త

వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యాంగా పని చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.ఉత్తన్న పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వడ్డెర్ల సంక్షేమ కమిటీ సమావేశంను పుట్టపర్తి పట్టణంలోని శిల్పారామం నందు ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, గతంలో అధ్యక్షునిగా పని చేసిన వ్యక్తి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నందున కమిటీలో చర్చించి ఆమోద్యయోగ్యమైన మల్లేపల్లి ఉత్తన్నను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న మాట్లాడుతూ, కమిటీలోనిర్ణయించిన పనులనే పార్టీలకు అతీతంగా చేపడతామని, ముఖ్యంగా వడ్డెర్లకు కమ్యునిటీ భవనం, కల్యాణమండపం, పేద విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు నిధుల కోసం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలను కలసి విన్నవిస్తామన్నారు. గౌరవాధ్యక్షులు దళవాయి వెంకటనారాయణ మాట్లాడుతూ, వడ్డెర్లు రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఎదగడానికి సంఘం పని చేస్తుందని, వడ్డెర్ల సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వడ్డెర్లంతా ఐక్యంగా కలసి వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మారెప్ప, వెంకటగిరిపాలెం శ్రీనివాసులు, కదిరి గంగరాజు, పాలకుంట రఘురాములు, కార్యవర్గ సభ్యులు గోగుల రామాంజినేయులు, ముదిగుబ్బ వెంకటపతి, గంగులప్ప,డీలర్ పెద్దన్న, మహిళా అధ్యక్షురాలు ఇడగట్టుజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనతాండాల్లో మౌలిక వసతులు కల్పించండి

శ్రీసత్యసాయిజిల్లా, జులై 26, ప్రభాతవార్త ప్రతినిధి:



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న ఎస్‌టి కమీషన్ సభ్యుడు వడిత్యాశంకర్‌నాయక్

శ్రీసత్యసాయి జిల్లాలోని గిరిజన తాండాల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్‌టి కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్‌ను కలుసుకొని పుష్పగుచ్చం అందించి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ముఖ్యంగా జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి తాండాకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికలకు తగిన స్థలం కేటాయించాలని, వసతిగృహాల్లో , పాఠశాలల్లో, హెల్త్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని, గిరిజన భవన్ నిర్మించాలని కోరారు. ఆయన వెంట మల్లికార్జున నాయక్, ఎస్‌టి సంక్షేమ శాఖ అధికారి మోహన్, ఎస్‌ఓ శ్రీనివాసనాయక్ తదితరులు ఉన్నారు.

### జిల్లా ఎస్‌పిని కలుసుకున్న వడిత్యా శంకర్‌నాయక్

రాష్ట్ర ఎస్‌టి కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఇటీవల శ్రీసత్యసాయిజిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన వి.రత్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందించడంతో పాటు పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయన ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు.



ఎస్‌పికు మొక్కను అందిస్తున్న దృశ్యం




# ముడా భూముల అక్రమాలకు పాల్పడలేదు

### - నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం మచ్చలేని జీవితం నాది : సిద్దరామయ్య



బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతున్న సిఎం సిద్దరామయ్య తదితరులు

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

నా 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చ లేకుండా జీవించాను. నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం.ఇన్నాళ్లు మచ్చలేకుండా రాజకీయాల్లో ఉన్నా.నేను రెండో సారి కర్ణాటక సిఎం కావటాన్ని జీర్ణించుకోలేక బిజెపి జెడిఎస్ పార్టీ నాపై ద్వేషపూరిత,కక్షపూరిత రాజకీయాలకు దిగారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పారు.ఆయన ముడా అక్రమాల్లో తన పాత్ర ఉందన్న విపక్షాల ఆరోపణలకు శుక్రవారం అన్ని దాఖలాలతో జవాబిచ్చారు.నేను 1981లో ఎంఎల్ఎ అయ్యాను.1983లో హెగ్డే కెబినెట్‌లో మంత్రిగా చేరాను. అప్పటినుంచి కర్ణాటకలో పలుసార్లు మంత్రిగా ఉపముఖ్యమంత్రిగా రెండుసార్లు సిఎంగా పనిచేస్తున్నాను.నా రాజకీయ అభివృద్ధిని చూసి ఓర్వలేకుండా బిజెపి నాకు వ్యతిరేకంగా ముడా అక్రమాల ఉచ్చు పన్నిందని ఆరోపించారు.1935 సంవత్సరంలో లింగ బిన్ జవర అప్పటి సర్కారు హరాజులో ఒక్క రూపాయికి మూడెకరాల 16గుంటల భూమిని కొనుక్కున్నారు.ఇది దళితులకు గ్రాంట్ చేసిన భూమి కానేకాదనిచెప్పారు.ఆతరువాత లింగ ముగ్గురు కుమారులు సక్రమంగానే దీనిని వాడుకున్నారని తెలిపారు.లింగ నుంచి ముగ్గురు కుమారులు మల్లయ్య ,మైలారయ్య దేవరాజుకు ఈ భూములు దఖలు చేయగా ఆర్థిక అవసరాల కోసం ఇద్దరు సోదరులు దేవరాజుకు ఈభూములను క్రయానికి ఇచ్చారని చెప్పారు.దేవరాజు 2004లో ఈభూములను తనపేరిట రిజిస్టర్ చేయించుకుని నాబావమరిది మల్లికార్జునస్వామికి 2010లో విక్రయించాడు.ఇవన్నీ చట్టబద్దంగా జరిగిన తరువాత నా బావమరిది తన అక్క పార్వతి అంటే నాశ్రీమతికి పసుపు కుంకుమాల పేరిట గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చాడు.అయితే ఈభూములు పిటిసిఎల్ చట్టం భూములు కానేకాదని సిఎం స్పష్టీకరించారు.ఈమధ్యలో మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార కెసరె గ్రామంలోని మల్లికార్జునస్వామి జమీను అక్రమంగా స్వాధీనం చేసుకుని అక్కడ కొత్తగా లేఔట్ చేసి నివేశనాలను ఏర్పాటుచేసి విక్రయించింది. ఈసమాచారం 2014లో నాకు తెలిసింది.ఈభూములను స్వాధీనం చేసుకోవాలని నాభార్య పార్వతి నన్ను అడిగినా కూడా నేను సిఎంగా పనిచేస్తున్నాను. ఇలాంటి పని నావలన కాదని కరాఖండిగా చెప్పాను. ఆతరువాత ఆమె తన భూములకు బదిలి భూములు ఇవ్వాలని ముడాకు అర్జీ పెట్టుకుంది.తమవలన తప్పు జరిగిందని ముడా చెప్పి పరిహారంగా వేరేచోట 50.50 నిష్పత్తిలో బదిలీ భూములు ఇస్తామని ముడా అధికారులు చెప్పారు.2021లో యడ్యూరప్పహయాంలో ముడా అధ్యక్షుడుగా ఉన్న లింగప్ప నాశ్రీమతికి 3.16ఎకరాలకు బదులుగా 34వేల చదరపు అడుగుల భూమిని కేటాయించారు.అదే సమయంలో మరో 195మందికి కూడా మైసూరు విజయనగర లేఔట్ 4,5స్టేజిల్లో నివేశనాలు మంజూరు చేశారు.ఇదంతా చట్టబద్దంగానే జరిగింది.దీంట్లో నెనెక్కడ అక్రమాలకు పాల్పడ్డానో తెలపాలని సవాల్ విసిరారు.రాజకీయంగా నాపై కక్ష తీర్చుకునేందుకు బిజెపి నాయకులు ఇపుడు ముడా కేసు సాకుతో బురదజల్లుతున్నారు.బిజెపి వారే నాభార్యకు భూములు మంజూరు చేసి ఇపుడు నేను అక్రమాలు చేశానని శంఖం ఊదటం ఏమి న్యాయమని ప్రశ్నించారు.బిజెపి గత విధానసభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది.లోకసభ ఎన్నికల్లోను 9సీట్లలో పరాజయం చెందారు.ఇలాంటి దిక్కుమాలిన కేసును పట్టుకుని రాజకీయంగా బలపడాలని చూస్తున్నారు.వారు ఆటలుకొనసాగవని చెప్పారు.గత బిజెపి సర్కారులో జరిగిన అన్ని అక్రమాలను బయటకు లాగా నిందితులను శిక్షిస్తామని సిఎం సిద్దరామయ్య చెప్పారు.సమావేశంలో మంత్రులు భైరతీ సురేష్ కొడగు ఎంఎల్ఎ పొన్నణ్ణ తదితరులు పాల్గోన్నారు.

# హాసన్ జిల్లాలో నిండిన హేమావతి ఆనకట్ట

### - హొళె నరసీపుర పట్టణం ముంపులో




**హాసన్,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

హాసన్ జిల్లాలోని గోరూరు వద్ద ఉన్న హేమావతి నది ఆనకట్టకు కావేరి పరివాహక ప్రాంతం నుంచి భారీఎత్తున వరదనీరు రావటంతో శుక్రవారం ఈ ఆనకట్ట నుంచి లక్ష క్యూసెక్కుల జలాలను బయటకు వదిలారు.దీంతో నదీ పాత్రలోని పలు గ్రామాలు హొళెనరసీపుర పట్టణం సమేతంగా వరదనీటి ముంపునకు గురైంది.హొళెనరసీపుర పట్టణంలో పలు ప్రాంతాల్లోకి వరదనీరు చొచ్చుకుని రావటంతో పట్టణంలోని ముప్పావు భాగం వరదనీటితో నిండిపోయింది.గతంలో ఎన్నడూ ఇలాగా వరదనీరు ఈ పట్టణంలోని వచ్చిన ఆనవాళ్లు లేదు.ఈసారి కావేరి పరివాహక ప్రాంతంలో వానలు పుంజుకుని జోరుగా కురుస్తుండటంతో హేమావతి ఆనకట్టకు పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది.జిల్లామొత్తంగా జోరువానలు కురుస్తుండటంతో సకలేశపుర తాలూకా సకలేశపుర పట్టణంలోని నదీనీరు పొంగిపొర్లుతుంది.శుక్రవారం సకలేశపుర తహశీల్దారు జి.మేఘన అక్కడి ఆజాద్ నగర్ ముంపు వాసులను పునరవాస కేంద్రానికి తరలించారు. సకలేశపుర హొళెమల్లేశ్వర దేవాలయం నీటమునిగింది.హేమావతి నదీనీరు వలన అరకలగూడు హొళెనరసీపుర రోడ్డు,చెన్నరాయపట్టణ హొళెనరసీపుర రోడ్లు జలమయం అయ్యాయి.హొళె నరసీపుర పట్టణంలోని ఎపిఎంసి యార్డుకు వరదనీరు రావటంతో అక్కడ రైతులు స్టాకు చేసిన వందల క్వింటాళ్ల ధాన్యం,మొక్కజొన్నలు, పెసలు కందులు నీటిపాలయ్యాయి. దాదాపు 50క్వింటాళ్ల మొక్కజొన్నలు నీటిలో కొట్టుకుపోయాయని రైతులు చెప్పారు. ఇవాళ పంటలు అమ్మేందుకు ఎపిఎంసి యార్డుకు తెచ్చిన ధాన్యాలు నీటిలో మునిగిపోయి నష్టం ఏర్పడింది.హొళె నరసీపుర పట్టణంలో వరదనీటి పరిస్థితిని హాసన్ కాంగ్రెస్ ఎంపీ శ్రేయస్ పటేల్ ఉన్నతాధికారులతో కలసి పరిశీలించారు. పరిహారపనుల కోసం అధికారులను పురమాయించారు.

# కర్ణాటక నూతన ముఖ్య కార్యదర్శిగా శాలిని రజనీష్ నియామకం



నూతన ముఖ్యకార్యదర్శి శాలిని రజనీష్

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటక నూతన ముఖ్యకార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి శాలిని రజనీష్‌ను నియమిస్తూ కర్ణాటక సర్కారు శుక్రవారం ఆదేశాలు ప్రకటించింది.ఇప్పటివరకు సిఎస్‌గా సేవలందిస్తున్న రజనీష్ గోయల్ ఈనెల31న రిటైర్ కానుండటంతో రజనీష్ భార్య శాలిని రజనీష్‌ను కొత్త సిఎస్‌గా నియమిస్తూ సర్కారు ప్రకటించింది.గతంలో బికె,భట్టాచార్య సిఎస్‌గా పనిచేసి రిటైరైన తరువాత ఆ అధికారి భార్య తెరెసాభట్టాచార్యను కొత్త సిఎస్‌గా నియమించారు.మళ్లీ చాలా కాలం తరువాత భర్త సిఎస్‌గా రిటైరైన తరువాత భార్య కొత్త సిఎస్‌గా అధికారం స్వీకరించనున్నారు. శాలినిరజనీష్‌కు 2సంవత్సరాల వ్యవధి ఉంది.ఇపుడామె రాష్ట్ర అదనపు ముఖ్యకార్యదర్శిగా డెవలప్‌మెంట్ కమిషనర్‌గా సేవలు అందిస్తున్నారు.

# విధానమండలి ప్రజాసమస్యలను చర్చించటంలో బిజెపి విఫలం

### - ఇద్దరు నాయకుల నిర్వాహాకం పట్ల అరవింద లింబావళి ఆరోపణలు

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**



బిజెపి ప్రధానకార్యదర్శి అరవిందలింబావళి

కర్ణాటకలో ఇటీవల జరిగిన విధానసభ విధానపరిషత్ పదిరోజుల సమావేశాలను ప్రజాసమస్యలకోసం పోరాటం చేయాల్సిన ప్రధాన ప్రతిపక్షం బిజెపి ఇద్దరు నాయకుల అడ్జస్టుమెంట్ రాజకీయాలకు బలయ్యాయని బిజెపి సీనియర్ నాయకుడు పార్టీ ప్రధానకార్యదర్శి అరవింద లింబావళి ఆరోపించారు.ఈయన శుక్రవారం బెంగళూరులో విలేకరుల సమావేశం జరిపి పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్‌ల పనితీరును దుయ్యబట్టారు.విధానసభలో 66మంది శాసనసభ్యుల బలం ఉన్న బిజెపి రాష్ట్రంలో తలెత్తిన వరదల పరిస్థితి ప్రజల కడగండ్లు, రైతుల సమస్యలు,ప్రజల సమస్యలను చర్చకు పెట్టడంలో విఫలం అయ్యాయని తెలిపారు.ముడా అక్రమాలు, వాల్మీకి కార్పొరేషన్ అక్రమాలు కేవలం రెండు సమస్యలపైన మొత్తం సభాకాలాన్ని వ్యయం చేసి ఏమి సాధించారని నిలదీశారు.సమావేశాలు ఒకరోజు ముందుగానే ముగిసిపోవటానికి విజయేంద్ర,ఆర్.అశోక్ కారణమని ఆరోపించారు.గతంలో శాసనసభలో బిజెపి జరిపిన సాహసోపేతమైన పోరాటాలు ఆందోళనలను పరికిస్తే ఈసారి శాసనసభ సమావేశాల్లో ప్రతిపక్షాలు చాలా పేలవంగా తమ నడవడికను చూపాయని నిరసించారు.బిజెపి చరిత్ర పరికిస్తే ఇది చాలా వీక్‌గా కనపడుతుందని అన్నారు.పార్టీ అధ్యక్షుడు విజయేంద్రకు ప్రతిపక్ష నాయకుడు అశోక్ కు మధ్య సమన్వయం కొరత ఉంది.ఇరువురు వేర్వేరుగా తీర్మానాలు చేసి పార్టీ నాయకులను శాసనసభ్యులను గందరగోళం చేస్తున్నారని విమర్శించారు.ఈ ఇద్దరు నాయకుల వలన బిజెపికు ఉన్న వర్చస్సు క్రమేసి తగ్గిపోతుందని అన్నారు.పార్టీ అగ్రనాయకత్వం వీటిని సరిచేసి ఈ ఇరువురు నాయకులను ట్రాక్‌పైకి తీసుకురావాలని కోరారు.

# తుమకూరు జిల్లాలో విచ్చలవిడిగా పెళ్లికాని యువతులపై అఘాయత్యాలు

### - 400మంది గర్భిణులు నివేదిక వెల్లడి



తుమకూరు విశ్వవిద్యాలయం నిర్వహించిన సెమినార్ దృశ్యం.

**తుమకూరు,జూలై 26,ప్రభాతవవార్త ప్రతినిధి**

బెంగళూరు ముంబాయి నాల్గో నెంబరు జాతీయరహదారిలో ఉన్న తుమకూరు జిల్లా తుమకూరు పట్టణంలో గత ఏడాది కాలంలో పెళ్లికాని 400మంది యువతులు గర్భం ధరించారని వీరిపై అఘాయత్యాలు జరిపిన 125మందిపైన పోక్సో కేసుల్లో జైలు పాలయ్యారని జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి నూరున్నీసా చెప్పారు.ఆమె తుమకూరు విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆన్‌లైన్‌లో పరిచయాలు లైంగిక దౌర్జన్యాలు పోక్సో చట్టం ద్వారా నివారణ చర్యలు సెమినారులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు.జిల్లాలోని అనేకమంది బాలికలు ఆన్‌లైన్ పిచ్చిలో పడి సులభంగా దుండగుల చేతికి చిక్కి లైంగిక దౌర్జన్యాలకు గురవుతున్నారని చెప్పారు.ఈ జిల్లా ప్రముఖ విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందినా కూడా గ్రామీణ ప్రాంతాల యువతులు సులభంగా దుండగుల మాయమాటలకు చిక్కుకుని లైంగిక నేరాలకు గురవుతున్నారు.ఒక కేసులో అయితే కేవలం పది సంవత్సరాల బాలిక రేప్‌కు గురైందని నూరున్నీసా చెప్పారు.పోక్సో కేసుల్లోఅరెస్టు అయిన వారిలో చాలామంది ఆడపిల్లల తండ్రులు,స్వామీజీలు,అన్న తమ్ముళ్లు,దగ్గర బంధువులు టీచర్లు ఉన్నారు.కొంతమంది అయితే రెండేసి సార్లు పోక్సో కేసుల్లో అరెస్టు అయిన వ్యక్తులు ఉన్నట్లు చెప్పారు.జిల్లాలో యువతులు మహిళలపై కొనసాగుతున్న లైంగిక దౌర్జన్యాలను నివారించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందిగా చర్యలు తీసుకుని విజిలెంట్‌గా పనిచేయాలని కోరారు.తుమకూరు జిల్లాలో 6వేల డైవర్స్ కేసులు కొనసాగుతున్నాయని చెప్పారు.అపరిచితుల నుంచి విడియో కాల్ స్వీకరించే ముందు యువతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని కోరారు.సైబర్ నేరాలకు పాల్పడిన దుండగులకు 10లక్షల జరిమాన పది నుంచి 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష ఉంటుందన్న సంగతిని యువతులు గుర్తించాలని మనవి చేశారు.తుమకూరు యూనివర్శిటి ఉపకులపతి ఆచార్య ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాగరికత పెరగటంతో విద్యావంతులు పెరిగారు.వీరితోపాటు నేరాలు కూడా పెరిగి సమాజాన్ని అధోగతికి తీసుకువెళుతున్నాయని చెప్పారు.సభలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె.ప్రసన్న కుమార్,ప్రిన్సిపాల్ బి.కరియప్ప ప్రొఫెసర్లు నూర్ ఆఫ్జా,మొన్సీందర్ కౌర్,ఎ.మోహన్‌రామ్ ,సునీతా గాణిగర్ పాల్గోన్నారు.

# సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు మంత్రి ఈశ్వర్ ఖండ్రే

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో ఇకమీదట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించటాన్ని నిషేధించేందుకు త్వరలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటుచేస్తామని అరణ్యశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే చెప్పారు.ఆయన శుక్రవారం విధానసౌధలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.రాష్ట్ర పర్యావరణాన్ని నాశనం చేస్తున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను అదుపుచేసి నిషేధించేందుకు సర్కారు గట్టి చర్యలు తీసుకుంటుందని చెప్పారు.పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వస్తున్న వాహనాలను సోదా చేసేందుకు ఇతర ప్రయాణ వాహనాలను పరిశీలించేందుకు పోలీసుశాఖ రవాణాశాఖ బిబిఎంపి అధికారులతో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేస్తామన్నారు.

# ఎట్టకేలకు రామనగర జిల్లాకు బెంగళూరు దక్షిణ జిల్లాగా పునర్‌నామకరణం - కెబినెట్ నిర్ణయం



బెంగళూరులో రాష్ట్ర మంత్రివర్గ సమావేశ తీర్మానాలను విలేకరులకు తెలిపిన న్యాయశాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో 20 సంవత్సరాల కిందట కొత్తజిల్లాగా ఏర్పాటు అయిన రామనగర జిల్లాను ఇకమీదట బెంగళూరు దక్షిణజిల్లాగా పునర్ నామకరణం చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం సభ తీర్మానించిందని న్యాయశాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్ చెప్పారు.ఆయన శుక్రవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో చేసిన తీర్మానాలను విలేకరుల సమావేశంలో చెప్పారు.2004 2005లో ఏర్పాటైన 20.20 సర్కారు తరువాత ఏర్పాటైన కుమారస్వామి సర్కారు బెంగళూరు గ్రామీణ జిల్లాను నాలుగు తాలూకాలతో ప్రత్యేకంగా విభజించి రామనగర జిల్లాను ప్రకటించారు.ఆనాడు రామనగర కనకపుర చెన్నపట్టణ,మాగడి తాలూకాలు ఉండేవి.ఇపుడు కొత్తగా హారోహళ్లి తాలూకాతో 5తాలూకాలుగా ఉన్నాయి.త్వరలో విధానసభ ఎన్నికల్లో కొత్త జిల్లాగా బెంగళూరు దక్షిణజిల్లాను ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ ప్రకటించి ఇపుడు చెన్నపట్టణ విధానసభ ఉప ఎన్నికల్లో దీనినే ప్రధాన అంశంగా ప్రచారం చేసి ఎట్టకేలకు రామనగర స్థానంలో బెంగళూరు దక్షిణజిల్లాను ప్రతిష్టిస్తున్నారు.దీనివలన బెంగళూరు నగరజిల్లా బెంగళూరు గ్రామీణజిల్లా బెంగళూరు దక్షిణజిల్లాతో మండ్యవరకు బెంగళూరు పరిధి విస్తరించనుంది.ఇప్పటికే బెంగళూరు మైసూరుల మధ్య ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించిన సర్కారు రామనగరను బెంగళూరు దక్షిణ జిల్లాగా నామకరణం చేసి ఇక్కడి భూములకు బంగారం వెల రప్పిస్తోంది.ఈమధ్యలో బిఎంఆర్‌సిఎల్ మైసూరురోడ్డులోని చల్లఘట్ట నుంచి బిడదివరకు మెట్రోరైలును విస్తరించేందుకు సంసిద్ధం కావటంతో ఈ ప్రాంతంలోని భూములు ఆస్తులకు అత్యధిక ధర పలకనుంది.బెంగళూరు దక్షిణ జిల్లా ఏర్పాటు ద్వారా రామనగరలోని అయిదు తాలూకాలకు శుక్రదశ పట్టనుంది.మంత్రివర్గం ఇతర తీర్మానాలు ప్రకారం కర్ణాటకలోని 18 ఎస్సీ హాస్టళ్లకు తలా 7కోట్ల రూపాయలతో 105కోట్లుతో కొత్త భవనాలను నిర్మించేందుకు వీటిని ప్రజాపనులశాఖ నిర్మిస్తుందని చెప్పారు.జూనియర్ కాలేజీల లెక్చరర్లకు పదోన్నతి కలిగించేందుకు కనీసం 50శాతం మార్కులను బెంచ్‌మార్కుగా పరిగణించేందుకు విద్యాశాఖ చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది.ఎస్సీ అభ్యర్థుల నియామకాల్లోను ఇదే పద్దతి అనుసరిస్తారని మంత్రి చెప్పారు.ప్రభత్వం కొత్తగా కర్ణాటక కౌశల్య అభివృద్ధి కార్పొరేషన్‌ను 2013 కంపెనీయాక్టు ప్రకారం ఏర్పాటు చేసేందుకు కెబినెట్ అనుమతి ఇచ్చింది.మండ్య జిల్లాలోని కెఆర్ఎస్ దిగువన 198 ఎకరాల్లో ఉన్న బృందావన గార్డెన్స్‌ను 2663కోట్ల రూపాయలతో పబ్లిక్ ప్రవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసేందుకు కెబినెట్ అనుమతించింది.అక్కడ కొత్తగా 5స్టార్‌హోటల్,వాటర్‌రైడింగ్ ఉద్యానవనం అభివృద్ధి జరుగుతాయని చెప్పారు.ఈ కాంట్రాక్టు 34సంవత్సరాలు అమల్లో ఉంటుంది.బృందావన్ గార్డెన్స్‌కు గత వైభవం తెచ్చేందుకు సర్కారు ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

# బెంగళూరులో వారంరోజులపాటు సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

తెలుగు ప్రఖ్యాత ప్రవచనకారుడు సామవేదం షణ్ముఖ శర్మ బెంగళూరులో వారంరోజుల పాటు ప్రవచనాలను ఇవ్వనున్నారు.ఈమేరకు బెంగళూరు రుషీపీఠం సత్సంగ సంఘం శుక్రవారం తెలిపారు.వచ్చే ఆగస్టు 1 నుంచి 7వరకు బెల్లందూరులోని హొరైజాన్ ఇంజనీరింగ్ కాలేజి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇస్తారు వ్యాసమహర్షి విరచిత మహాభారతంలోని ఘట్టాల గురించి వ్యాఖ్యానిస్తారు.మహాభారతంలో మనకోసం గాథలు బోధనలు అంశం గురించి మాట్లాడుతారు.

# బెళగావి జిల్లాలో వరదలు :ఖానాపూర్‌లో మంత్రి సతీష్ జారకిహొళి పరిశీలన



ఖానాపూర్‌లో వరద ప్రాంతాల్లో మంత్రి సతీష్ పర్యటన

**బెళగావి,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**

పలునదుల గుండా విడుదలైన వరద నీటితో సతమతం అవుతున్న బెళగావి జిల్లాలో శుక్రవారం జిల్లా ఇంఛార్జీ మంత్రి సతీష్ జారకిహొళి పలుచోట్లకు పర్యటించి వరద సహాయక పనులను పరిశీలించారు.బెళగావి జిల్లా ఖానాపూర్ తాలూకా పట్టణంలో వరదనీటి వలన ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు.ఖానాపూర్ తాలూకాలోని అటవీ ప్రాంతంలోని 15గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి.అక్కడి గ్రామాల నివాసుల కోసం మంచి రోడ్డు వేయాలంటే కేంద్ర అటవీచట్టం అడ్డువస్తోంది. దీనిని సరిచేసేందుకు త్వరలో బెంగళూరులో రాష్ట్ర అటవీశాఖ మంత్రి అధికారులతో సభచేసి తీర్మానం చేస్తామని చెప్పారు. ఆతరువాత ప్రజాపనులశాఖ తో అడవుల్లో అన్నిరుతువుల రోడ్లను నిర్మిస్తామని చెప్పారు.మంత్రి జిల్లా కలెక్టర్ మహమద్ రోషన్ జిల్లా ఎస్పీ తదితర అధికారులు పాల్గోన్నారు.

# చిత్రదుర్గలో రేణుకాస్వామి కుటుంబాన్ని భేటి చేసిన కన్నడ నటుడు వినోద్‌రాజ్ చేత లక్ష సాయం

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవవార్త ప్రతినిధి**



కన్నడ నటుడు వినోద్‌రాజ్

సినీహీరో చేతిలో హత్యకు గురైన చిత్రదుర్గ నివాసి రేణుకాస్వామి కుటుంబానికి కన్నడ నటుడు వినోద్‌రాజ్ శుక్రవారం లక్ష రూపాయల సాయం అందించారు. ఈసందర్భంగా రేణుకా స్వామి తండ్రి మాట్లాడుతూ తన కుటుంబానికి ఆసరాగా ఉన్న ఏకైక కుమారుడు ఎర్తయ్యాడు గురయ్యాడు.మమ్మల్ని కర్ణాటక సర్కారు ఆదుకుని నాకోడలుకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని మనవి చేశారు.కాగా నటుడు వినోద్‌రాజ్ బుధవారం బెంగళూరు సెంట్రల్ జైలులో ఉన్న హీరో దర్శన్‌ను భేటిచేసి మాట్లాడారు.అతడికి వినోద్‌రాజ్ ధైర్యంచెప్పాడు. అయితే వీరివురిమధ్య జరిగిన చర్చల సారాంశం తెలియలేదు.నటుడు వినోద్‌రాజ్ హఠాత్తుగా చిత్రదుర్గకు వెళ్లి హతుడి కుటుంబాన్ని కలవటం రాజీ సంధానం గురించి చర్చించారా అనేది తెలియాల్సి ఉంది.

# సిఎం సిద్దరామయ్య తన నివేశనాలు వాపస్ చేస్తే నేను కూడా నా నివేశనాన్ని వెనక్కి ఇస్తా

### - హెచ్‌డి.కుమారస్వామి

**బెంగళూరు,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి**



కేంద్రమంత్రి కుమారస్వామి.

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార అక్రమంగా నివేశనాలు పంపిణీ చేసిన కేసులో సిఎం సిద్దరామయ్య తన శ్రీమతికి లభించిన నివేశనాలను సర్కారుకు దఖలు చేస్తే నేను కూడా అక్కడి నా నివేశనాన్ని వాపస్ చేస్తానని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి చెప్పారు.ఆయన శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో తనను కలుసుకున్న మీడియా ప్రతినిధులతో ఈమేరకు తెలియజేశారు.నేను 1984లోనే మైసూరులో 37వేల రూపాయలతో ఒక పరిశ్రమ నివేశన కొనుగోలు చేశాను.అయితే ముడా ఈనివేశనం సకాలంలో మంజూరు చేయకుండా చాలా సంవత్సరాల తరువాత 21వేల చదరపు అడుగుల బదిలీ నివేశనం మంజూరు చేసింది.దీనిని అక్రమంగా శాంక్షన్ చేయించుకున్నానని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.ముఖ్యమంత్రి సిద్దరామయ్య శ్రీమతి పేరిట మంజూరైన నివేశనాలను వాపస్ చేస్తే నేను కూడా నా నివేశనాన్ని సర్కారుకు వెనక్కి ఇస్తానని చెప్పారు.ఈమేరకు సిఎంకు సవాల్ విసిరారు.

# డ్రైనేజీ డంపు యార్డు పరిశీలించిన కూటమి నాయకులు

**ధర్మవరం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

ధర్మవరం రూరల్ పరిధిలోని తుమ్మల గ్రామ పంచాయితీ సమీపాన ఉన్న డంప్ యార్డుని శుక్రవారం ఎన్డీయే కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. అనంతరం మల్లెనపల్లి గ్రామంలో డ్రైనేజీ కాలువను కూడా పరిశీలించారు. డ్రైనేజీ కాలువ మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తోందని, అపరిశుభ్రత కారణంగా దోమలు ఎక్కువయ్యాయి. వ్యాధులు ప్రభలుతున్నాయని గ్రామ ప్రజలు నాయకులకు తెలియజేశారు. ఆ గ్రామ సచివాలయ ఉద్యోగులకు తెలియపరిచి అక్కడ నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# మృతుడు కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పోతుల నాగేపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా ఓబన్న విధులు నిర్వహిస్తూ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు రమేష్‌బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి డిప్యూటీ తహశీల్దారు ఈశ్వరయ్య, విఆర్‌ఓ భాస్కర్ వెళ్లి పరామర్శించి 25వేలు ఆర్థిక సాయం అందించారు. పలువురు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డ్వామా పిడి



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న దృశ్యం

**తాడిమర్రి, జులై 26 ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డ్వామా పిడి, స్పెషల్ ఆఫీసర్ విజయేంద్ర ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ పనులను లేబర్ వార్డు ఆసుపత్రి రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన సమయంలోగా సిబ్బంది ఆసుపత్రిలో ఉండాలని రోగులకు, మర్యాద పూర్వకంగా మాట్లాడి వారికి చికిత్సలు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత, డా.గోవర్దన్‌నాయుడు, ఆరోగ్య సిబ్బంది సలు సమస్యలను తెలిపారు.

# ఉచిత కంటి చికిత్సశిభిరంను సద్వినియోగం చేసుకోండి




మాట్లాడుతున్న అధ్యక్షులు వేణుగోపాలాచార్యులు

**ధర్మవరం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 28వ తేదిన ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి చికిత్స శిభిరమును నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు వేణుగోపాలాచార్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిభిరానికి క్యాంపు దాతగా కొత్త శ్రీరాములు వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిట్టా వెంకటస్వామితోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. అధిక సంఖ్యలో కంటి ఆపరేషన్‌లతోపాటు ఉచితంగా అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహజంచడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోశాధికారి నాగేంద్ర, కార్యదర్శి రమేష్‌బాబు తెలియజేశారు.

